క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడదగిన క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు వంటివి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు అంగన్‌వాడీల జిల్లా మహాసభ

లక్ష్మీపురం: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు జి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ గురువారం పాతగుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ హాజరవుతారని చెప్పారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



గుంటూరు మెడికల్: జీఎస్టీ స్లాబ్ తగ్గించడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణ ఎన్నికల్లో విజయం సాధించినందుకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దూర దృష్టి నాయకుడని పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట నుంచి శంకర్ విలాస్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

22 నుంచి దేవి నవరాత్రులు ప్రారంభం



నగరంపాలెం: కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి 104వ దేవి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కోట శేషగిరి అన్నారు. ఆర్.అగ్రహారం అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఉత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అమ్మవారికి అలంకారాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది రోజులు ఉదయం ఏడున్నర నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10.30 వరకు అమ్మవారిని దర్శించుకోవచ్చునని తెలిపారు. వచ్చే నెల 2న సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా చేపడతామని అన్నారు. కార్యక్రమంలో కొనకళ్ల సత్యం, వనమా నరేంద్ర, దేవేంద్రగుప్తా, శేఖర్, కారంశెట్టి లోకేష్, సాగర్, కొత్తూరి వెంకట్, సముద్రాల గణేష్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో భాగంగా అన్నదానం



పట్నంబజారు: నగరంలోని 2వ డివిజన్ సీతానగర్ నాలుగో లైనులో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీన్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూరిఫాతిమాను చవితి పందిరి నిర్వాహకులు దుశ్శాలువతో సత్కరించారు.

పగలంతా ఉక్కపోత.. రాత్రి కుండపోత

నగరంపాలెం: నగరంలో బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి రహదారులు, వీధులు నీట మునిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగర ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. గాలి కూడా లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. అయితే రాత్రి 9 గంటలకు భారీ వర్షం కురిసింది. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహన చోదకులు వానలో తడిసి ముద్దయ్యారు. రహదారుల వెంట చిరు వ్యాపారులు వాన ధాటికి పరుగులు తీశారు. దీంతో దుకాణాలు ఎదుట ఉండిపోయారు. ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

తనిఖీలు లేక.. ఆరోగ్యం కానరాక

- పొన్నూరు పురపాలికలో కొరవడిన పర్యవేక్షణ
- ప్రజా సంక్షేమంపై లేని శ్రద్ధ
- క్షేత్రస్థాయిలో పర్యటించని కీలక శాఖల అధికారులు

పొన్నూరు: ప్రజారోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పొన్నూరు పురపాలికలో ప్రతి శాఖ పరిధిలో తనిఖీలు చేపట్టాలి. ముఖ్యంగా తూనికలు–కొలతలు, ఆరోగ్యం తదితర శాఖల పరిధిలో అధికారులలో నిర్లిప్తత నెలకొంది. ఆయా శాఖల అధికారులు కనీసం నెలకు ఒక్కసారి కూడా తనిఖీలు చేయడం లేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆహార శుభ్రతపై పర్యవేక్షణ ఏదీ..?

హోటళ్లు, రోడ్డు వెంబడి తోపుడు బండ్లపై నిర్వహించే తినే పదార్థాల వ్యాపారాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రతి రోజూ పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది వస్తుంటారు. హోటళ్లు, మొబైల్ క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వీరిని తనిఖీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారు. మాంసం, చికెన్ తదితర వాటిని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యత లోపిస్తోంది. రోడ్డు వెంబడి తోపుడు బండ్లలో వినియోగించిన నూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



పట్టణంలో మళ్లీ మళ్లీ వినియోగిస్తున్న వంట నూనె

వేసిందే తూకం.. చెప్పిందే ధర

పట్టణంలో తూనికలు, కొలతల మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దుకాణాల్లో కాటాలు, తూకం రాళ్లను తనిఖీలు చేయాల్సిన అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో వ్యాపారులు వేసిందే తూకం.. చెప్పిందే ధర అన్నట్లుగా మారింది. ఫలితంగా వినియోగదారులు నష్టపోతున్నారు. తూనికల శాఖ అధికారులు నెలల తరబడి కూడా తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

తనిఖీలు శూన్యం

పట్టణంలోని ఎరువులు, పురుగు మందులపై నిరంతర తనిఖీలు శూన్యం. వ్యవసాయ సీజన్‌లో సంబంధిత అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దుకాణాలలో ధరల పట్టిక కనిపించడం లేదు. రైతులకు రశీదులు ఇవ్వడం లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఏటా నాణ్యత లేని పురుగు మందులు వినియోగించి రైతులు నష్టపోతున్నారు.

పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం

పట్టణంలో ప్లాస్టిక్ విక్రయాలపై నిషేధం ఉంది. కానీ ఐలాండ్ సెంటర్, మెయిన్ రోడ్డు, కసుకర్రు రోడ్డు, ఎస్బీపీ రోడ్డు, కూరగాయల మార్కెట్, ఇతర ప్రాంతాల్లోని దుకాణాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల మున్సిపల్ అధికారులు పలు దుకాణాలపై దాడులు నిర్వహించి టన్నుల కొద్దీ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. అయితే నిరంతరం తనిఖీలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో మళ్లీ ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోంది.

చర్యలు తీసుకుంటాం



పురపాలక సంఘంలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై నిరంతరం తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశాం. కొందరికి జరిమానా విధించాం. ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తప్పవు.

– ముప్పాళ్ల రమేష్‌బాబు, పురపాలక కమిషనర్, పొన్నూరు

జ్ఞానానికి పేటెంట్, వారసత్వానికి జీఐ

చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల వర్క్‌షాప్

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఎంఎస్‌ఎంఈ–ఐపీఎఫ్‌సీ (మినిస్ట్రీస్ ఆఫ్ మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్–ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు. పేటెంట్ ఫైలింగ్, జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టడీస్ అనే అంశంపై ఈ వర్క్‌షాపును నిర్వహించనున్నారు. కార్యక్రమానికి చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖపట్నంకు చెందిన ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌వో, ఐఈడీఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ఎస్ రెడ్డి మాట్లాడుతూ జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) అనేది ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన ఉత్పత్తి లేదా కళాకృతికి లభించే గుర్తింపని తెలిపారు. ఇది ఆ ప్రాంతపు భౌగోళిక పరిస్థితులు, సంప్రదాయ పద్ధతులు, స్థానిక నైపుణ్యాల వల్ల ఏర్పడిన ప్రత్యేకతను కాపాడుతుందన్నారు. గుంటూరు మిరపకాయలు, తిరుపతి లడ్డూ, డార్జిలింగ్ టీ, పోచంపల్లి చీరలు జీఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తులని చెప్పారు. జీఐ ట్యాగ్ ద్వారా స్థానిక రైతులు, కళాకారులు, ఉత్పత్తిదారులు నేరుగా ప్రయోజనం పొందుతారని, నకిలీ ఉత్పత్తులు నిరోధించబడతాయన్నారు. గుంటూరు వోక్స్ ఫాంటమ్ ఐపీఆర్ అటార్నీ ఎం.సుధీర్ మాట్లాడుతూ పేటెంట్ అంటే ఒక నూతన ఆవిష్కరణ లేదా సాంకేతికతపై ఆవిష్కర్తకు చట్టబద్ధంగా లభించే హక్కు అని చెప్పారు. దీనివల్ల ఆవిష్కరణను అనుమతి లేకుండా ఇతరులు తయారు చేయడం, అమ్మడం, వాడుకోవడం నివారించబడుతుందన్నారు. గుంటూరు ఎంకాన్స్ స్పెషలిస్ట్ కన్సల్‌టెంట్ టీఆర్ రమేష్ మాట్లాడుతూ పేటెంట్ ఫైలింగ్, జీఐ స్టడీస్ నేటి జ్ఞానాధారిత సమాజంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలన్నారు. ఇవి ఆవిష్కరణలు, పరిశోధనలు, ప్రాంతీయ ప్రత్యేకతలను రక్షించడమే కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధి, సాంకేతిక ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తాయన్నారు. కళాశాల పిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ పేటెంట్ ఫైలింగ్ వ్యక్తిగత ఆవిష్కరణలను రక్షిస్తే, జీఐ ప్రాంతీయ ప్రత్యేకతలను కాపాడుతుందన్నారు. ఈ రెండు వ్యవస్థలు కలసి దేశంలో సాంకేతికత, పరిశోధన, కళ, సంస్కృతి, ఆర్థికాభివృద్ధి కోసం శక్తివంతమైన సాధనాలుగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 210 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.



అతిథులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆర్‌వీఆర్‌జేసీలో అంతర్జాతీయ నేత్రదాన దినోత్సవం

గుంటూరు రూరల్: నేత్రదానంతో అంధకారంలో ఉన్న జీవితాలకు వెలుగును ప్రసాదించవచ్చని కంటి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ షఫీల తెలిపారు. బుధవారం మండలంలోని చౌడవరం గ్రామం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యుల బృందం విద్యార్థులకు నేత్ర సంబంధిత రుగ్మతలు, కంటి సంరక్షణ పద్ధతులు, ఆరోగ్యకరమైన అలవాట్లపై సూచనలు చేశారు. విద్యార్థులు ఎక్కువసేపు కంప్యూటర్లు, మొబైల్స్ వినియోగించడంతో అనేక కంటి సమస్యలు వస్తున్నాయని, ముఖ్యంగా పాఠ్యాంశాలను మొబైల్ స్క్రీన్ ద్వారా కాకుండా పుస్తకాల రూపంలో చదవడం మంచిదన్నారు. నేత్రదానం చేయడం ద్వారా మరణానంతరం కూడా జీవించి, ఈ లోకాన్ని రెండోసారి చూసే భాగ్యం పొందుతారని, నేత్రదానం గొప్పదైన దానమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు తమ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని, ప్రజల్లో నేత్రదానంపై చైతన్యం కలిగిస్తూ వలంటీర్లు ఎల్లప్పుడూ ముందుండాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైద్యులు, కళాశాల యాజమాన్యం

ఆవిష్కరణలు సమాజహితంగా ఉండాలి

కిట్స్ కళాశాల సెక్రటరీ కోయి శేఖర్

ప్రత్తిపాడు: విద్యార్థులు నూతనంగా రూపొందించే ఆవిష్కరణలు సమాజ హితంగా ఉండాలని కిట్స్ కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో మేక్ స్కిల్డ్ సీఈవో పర్వతనేని మధు, టెక్నో ఫీచర్ ఇండియా సీఈవో బోయపాటి శివల సంయుక్త ఆధ్వర్యంలో జావా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్‌పై మూడు రోజుల పాటు జరగనున్న హ్యాకథాన్ బుధవారం ప్రారంభమైంది. తొలి రోజు ఐటీ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరానికి చెందిన 39 టీంలు పాల్గొన్నాయి. వారు చేసిన నూతన ఆవిష్కరణలను వివరించారు. విద్యుత్ మీటర్‌కు లొకేషన్‌ను అనుసంధానించడం ద్వారా తక్కువ సమయంలో సమస్యను పరిష్కరించేందుకు రూపొందించిన 'మీటర్ మ్యాప్ యాప్'కు మొదటి స్థానం, కళాశాలలో విద్యార్థులు, ఫ్యాకల్టీ ఫిర్యాదులు చేసేందుకు రూపొందించిన 'ఫిర్యాదుల నిర్వహణ యాప్'కు ద్వితీయ స్థానం, విద్యార్థులు తమ పుస్తకాలు, పరికరాలు తరువాత బ్యాచ్‌కు అందించేలా రూపొందించిన 'క్యాంపస్ కార్డ్ యాప్'కు తృతీయ స్థానం దక్కిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. కళాశాల చైర్మన్ కె.సుబ్బారావు, సెక్రటరీ కె.శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎం. ఎస్.ఎస్.సాయి, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌కు హాజరైన విద్యార్థులు తదితరులు

ఈనాడు రిపోర్టర్ సహా ఐదుగురిపై కేసు నమోదు

గుంటూరు: వివాహితను అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఘటనలో ఈనాడు రిపోర్టర్ సహా ఐదుగురిపై ప్రత్తిపాడు పోలీసు స్టేషన్లో కేసు నమోదయింది. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన కల్లూరి గురునాథంతో 2009లో నాగేశ్వరికి వివాహం అయ్యింది. గత కొంత కాలంగా భర్త గురునాథంతో పాటు అత్త కల్లూరి శివ నాగేంద్రం, మామ కల్లూరి వెంకటేశ్వర్లు, బావ కల్లూరి సురేష్ (ఈనాడు విలేకరి), అతని భార్య కల్లూరి విజయలక్ష్మిలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ నాగేశ్వరి సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. అనంతరం మంగళవారం రాత్రి ప్రత్తిపాడు పోలీసు స్టేషన్లో నాగేశ్వరి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో, ప్రత్తిపాడు ఈనాడు రిపోర్టర్‌తో పాటు మరో నలుగురిపై పలు సెక్షన్ల కింద ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయ కార్యదర్శులు సమయపాలన పాటించాలి




నెహ్రూనగర్: నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ, కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలోని 39, 40 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత సచివాలయంలోని హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి, పని వేళల్లో ఆఫీస్ పని మీద బయటకు వెళ్ళినప్పుడు కార్యదర్శులు తప్పనిసరిగా మూవ్మెంట్ రిజిస్టర్‌లో నోట్ చేయాలన్నారు. సచివాలయంలో నిర్వహించాల్సిన రిజిస్టర్లను అసంపూర్తిగా నిర్వహించడంపై కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సదరు రిజిస్టర్లను సరిగా నిర్వహించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 39వ సచివాలయంలో అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు లేకపోవుట గమనించి, సదరు సచివాలయంలో ఇన్‌చార్జి అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులను నియమించాలని మేనేజర్‌ను ఆదేశించారు.

కాణిపాకంలో మెరిసిన నృత్యకారిణులు



గుంటూరు ఎడ్యుకేషన్: చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహిస్తున్న శ్రీవరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో గుంటూరుకు చెందిన నృత్యకారిణులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గుంటూరుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీకి చెందిన 20 మంది నృత్యకారిణుల బృందం ఈనెల 8వ తేదీన కాణిపాకంలో ప్రదర్శన ఇచ్చారు. నాట్య గురువు అను శేఖర్ పర్యవేక్షణలో నృత్య కారిణులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, భక్తిగీతాలకు వేసిన నృత్యాలతో భక్తులు, ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు. దేవ శ్రీగణేషా, శ్రీనివాస కల్యాణం, రఘుకుల తిలకా రారా, నవదుర్గ, కాళింగ నర్తన, జనతా శబ్దం గీతాలకు ఇచ్చిన అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌తో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. నాట్య గురువు అను శేఖర్ మాట్లాడుతూ కాణిపాక వినాయకుని దేవస్థానంలో యేటా జరిగే బ్రహ్మోత్సవాల్లో గుంటూరు నుంచి వెళ్లి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నృత్య కారిణులతో భక్తిభావాన్ని పెంపొందించే రీతిలో ప్రదర్శనలతో గుంటూరు ఖ్యాతి చాటుతున్నట్లు వివరించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 7వ లైనులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జీవితమనేది చాలా అమూల్యమైనదని.. ఎటువంటి ఆటుపోటులకు లోనైన తట్టుకుని నిలబడాలని సూచించారు. విద్యార్థులంతా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ జీవితంలో ఒక లక్ష్యం అంటూ ఉండాలని, ఆ లక్ష్యం దిశగా వెళ్లేటప్పుడు ఎదురైనటువంటి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటు మన బలబలాలను తెలుసుకుని ముందుగా సాగాలని కోరారు. ఫౌండేషన్ కోర్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ డి.చంద్రికరెడ్డి మాట్లాడుతూ మనలో పాజిటివ్ ఎమోషన్స్, మన బిహేవియర్, పాజిటివ్ యాటిట్యూడ్స్ సరిగా ఉన్నాయా..లేదా అని మనకు మనమే సెల్ఫ్ చెక్ చేసుకోవాలని సూచించారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

పొన్నూరు: ఇకపై యూరియా లభిస్తుందని, రైతులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు రైతులకు భరోసా కల్పించారు. బుధవారం మండలంలోని ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మండలానికి 580 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆర్ఎస్కేలు, సొసైటీలు, జీడీసీఎంఎస్‌కు విడతల వారీగా యూరియా వస్తుందని అన్నారు. ఈ నెలఖారుకు గడువు తేదీ ముగియనుందని వెంటనే రైతులందరూ ఈ పంట నమోదు, ఈ కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. రానున్న రబీ సీజన్ నుంచి ఈ పంట నమోదు ప్రకారం యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు అవసరమైన మేరకు యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు బి.ప్రీతి, బి.శివ తేజస్విని, ఎంపీఈఓ ఎస్.సురేష్ బాబు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో వెంకటేశ్వరరావు

డ్రగ్స్, ఈవ్‌టీజింగ్‌పై యువతకు అవగాహన

గుంటూరు రూరల్: మండలంలోని చల్లావారిపాలెం విక్టోరియా ఫార్మసీ కళాశాలలో బుధవారం యువజన సర్వీసుల శాఖ, స్టెప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్ అబ్యూసింగ్, సైబర్ సెక్యూరిటీ ఈవ్‌టీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నార్కోటిక్ విభాగం ఎస్ఐ ఎం.సునీల్ బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత వారి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవటంతోపాటు జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. అనైతిక చర్యలకు పాల్పడటం ద్వారా సమాజంలో గౌరవాన్ని కోల్పోతారన్నారు. దీని వల్ల చట్టపరంగా శిక్షలు అనుభవిస్తారన్నారు. చెడు వ్యసనాలు మీ జీవితాలను నాశనం చేయటంతోపాటు మీ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెడతాయన్నారు. సైబర్ సెల్ విభాగం సీఐ నిస్సార్‌బాషా మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం అందించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుకోకుండా ఎవరైనా సైబర్ నేరాలవల్ల ఇబ్బంది పడినట్టయితే టోల్ ఫ్రీ 1930 నంబర్‌కు సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బి.ఇన్నయ్య, ప్రిన్సిపాల్ టి.వినయ్, యువజన సర్వీసుల శాఖ, స్టెప్ మేనేజర్ బి.రాధిక, ఉపాధి కార్యాలయం సిబ్బంది మల్లేశ్వరి, వి.సాయి సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అధికారులు, కళాశాల యాజమాన్యం

రక్తహీనత పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఐసీడీఎస్ పీడీ ప్రసూన

ప్రత్తిపాడు: రక్తహీనత పట్ల మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ పి.పి.జి.ప్రసూన అన్నారు. డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండర్ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ ప్రసూన మాట్లాడుతూ రక్తహీనత సమస్యను అధిగమించేందుకు మహిళలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రక్తహీనత సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుందన్నారు. బరువు తక్కువ చిన్నారులపై అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆరేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీలు వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉన్నారో లేదో పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీడీపీవో జి.విజయలక్ష్మి, అడిషనల్ సీడీపీవో సీహెచ్.విజయనిర్మల, వన్ స్టాప్ సెంటర్ ఏవో శాంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ప్రసూన

పత్తిలో రసం పీల్చు పురుగు నివారణపై అవగాహన

ప్రత్తిపాడు: పత్తి పంటలో రసం పీల్చు పురుగుల ఉధృతిని నివారించేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు ఏడీఏ ఎస్.మోహన్‌రావు అన్నారు. ప్రత్తిపాడు మండలం కొండేపాడు, కోయవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మోహన్‌రావు ఏవో, వ్యవసాయ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పత్తి పొలాలను పరిశీలించారు. పైరును రసం పీల్చు పురుగులు ఆశించడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యూరియా గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటను ఆశిస్తున్న రసం పీల్చే పురుగులను నివారించేందుకు ఎకరానికి ఒక లీటర్ నీటిలో 5 మి.లీ వేప నూనెను కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణ కోసం ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు..

అనంతరం యూరియా మీ చెంతకు అనే కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడులో ఏడీఏ, ఏవో మోహన్ ట్రేడర్స్, పయనీర్ ఎంటర్‌ప్రైజెస్, అమలింగేశ్వర ఫెర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీలు చేశారు. యూరియాను రూ.266.50కు మాత్రమే అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేతుల మీదుగా వ్యవసాయ డ్రోన్లు గనికపూడి, కోయవారిపాలెం రైతులకు పంపిణీ చేశారు.



ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ మోహన్‌రావు, ఏవో సుగుణ బేగం

దళితులకు అండగా ఎస్సీ, ఎస్టీ కమిషన్

తెలంగాణ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నెహ్రూనగర్: అన్ని విషయాల్లో దళితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) ఆధ్వర్యంలో చుండూరు పల్లెవీరుడు కొమ్మెర్ల అనిల్‌కుమార్ సంస్మరణ సభ బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు. వెంకటయ్య మాట్లాడుతూ చట్టాల అమలులో అగ్రవర్ణ రాజకీయ నాయకులు ఆటంకంగా నిలుస్తున్నారని ఆరోపించారు. విద్య, హక్కుల పరిరక్షణ కోసం, సబ్ ప్లాన్ నిధులు ఉపయోగించడం కోసం, బాధిత కుటుంబాలకు ఆదుకోవడం కోసం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అగ్రకుల ఉన్మాదులు ప్రైవేటు సైన్యాలుగా ఏర్పాటై ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో దళితులపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ దళితులంతా సంఘటితంగా పోరాటాలు చేస్తానే దళితులపై దాడులను అరికట్టగలమన్నారు. అనంతరం బక్కి వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మేళం భాగ్యరావు, తాటిపర్తి బాలస్వామి, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్, ఏసీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గురవయ్య, రిటైర్డ్ డీఎస్పీ కె.రవి కుమార్, మేడికొండ సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య